క్లుప్తంగా

నేడు ఆసరా చెక్కు అందజేత

కొవ్వూరు: నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. కొవ్వూరు పురపాలక సంఘం, కొవ్వూరు మండల పరిధిలోని డ్వాక్రా మహిళలంతా సభకు తరలి రావాలని మునిసిపల్ కమిషనర్ బి. శ్రీకాంత్ శనివారం కోరారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి వారు

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ రకాల పూలతో స్వామి, అమ్మవార్లను అలంకరించారు. వేకువజాము 4 గంటలకే మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయంలో దీపాలు వెలిగించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు. అన్న సమారాధనను హైదరాబాద్ వాస్తవ్యులు వేంద్ర కాశీ సోమేశ్వరరావు, రోజా రమణి దంపతులు ప్రారంభించారు. సుమారు 5 వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

నల్లజర్ల ఎంపీడీఓగా నరేష్‌కుమార్



నల్లజర్ల: మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా పీఎస్ నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన శనివారం మధ్యాహ్నం నల్లజర్లలో బాధ్యతలు చేపట్టారు. కోరుకొండలో ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన రాజశేఖర్ పదోన్నతిపై కాపు కార్పొరేషన్ డీఎంగా వెళ్లారు. కొత్తగా చార్జ్ తీసుకున్న నరేష్‌కుమార్‌కు వివిధ శాఖల అధికారులు ,కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

పెరవలి తహసీల్దార్‌గా దాసరి సుధ



పెరవలి: స్థానిక తహసీల్దార్‌గా దాసరి సుధ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఏలూరు జిల్లా ముసునూరు మండలం నుంచి ఇక్కడకు బదలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన టి.రాజరాజేశ్వరి జిల్లాలోని బిక్కవోలు తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన దాసరి సుధను ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అభినందించారు. అలాగే మండలంలోని వివిధ శాఖల అధికారులు వచ్చి తహసీల్దార్‌తో తమను పరిచయం చేసుకున్నారు. సుధను అభినందించిన వారిలో వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ఎంపీడీఓగా నరేంద్రరెడ్డి



బాధ్యతలు చేపట్టిన నరేంద్ర రెడ్డికి స్వాగతం పలికిన కార్యాలయ సిబ్బంది

ఉండ్రాజవరం: స్థానిక ఎంపీడీఓగా కె.నరేంద్ర రెడ్డి శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన గాదిరాజు రామకృష్ణం రాజు కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం ఎంపీడీఓగా పనిచేసిన నరేంద్ర రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసు, ఈవోపీఆర్డీ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ నాగనాథ్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఎంపీడీఓకు స్వాగతం పలికారు.

వృద్ధాశ్రమంలో అన్న సమారాధన

నిడదవోలు: స్థానిక సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పని చేసిన వేమూరి వీర వెంకట సత్యనారాయణ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం చర్ల సుశీల వృద్ధాశ్రమంలో అన్న సమారాధన నిర్వహించారు. మాస్టర్‌పై అభిమానంతో 1986-87 సంవత్సరపు పదో తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మాది నాగేశ్వరరావు, ఎం. ప్రసాద్, షరిప్, ఎస్. ప్రశాంత్, టీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

అన్ని దారులూ దెండులూరుకే..



నిడదవోలు నుంచి దెందులూరు సిద్ధం సభకు తరలి వెళుతున్న నాయకుల, కార్యకర్తలతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



దేవరపల్లి మండలం యర్నగూడెంలో సిద్ధం సభకు పార్టీ శ్రేణులతో తరలి వెళుతున్న గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ)



కొవ్వూరు మండలం కాపవరం జంక్షన్ వద్ద సిద్ధం సభకు తరలి వెళుతున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు

- సిద్ధం సభకు భారీగా తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- వందలాది బస్సులు, కార్లు, వేలాది బైక్‌లపై తరలిన అభిమానులు
- విస్తృత ఏర్పాట్లు చేసిన గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు ఎమ్మెల్యేలు, పరిశీలకులు

ఎక్కడ చూసినా 'సిద్ధం' అనే నినాదాలు మార్మోగాయి. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా పట్టణాలు, పల్లెలు అనే భేదం లేకుండా వైఎస్సార్ సీపీ పతాకాలు రెపరెపలాడాయి.ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఏ ఊరి నుంచి బయలుదేరిన బస్సులైనా, కారులైనా, బైక్‌లైనా వాటి గమ్యం మాత్రం దెండులూరే అన్నట్టుగా వాహనాల ర్యాలీ సాగింది.

దేవరపల్లి: ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల శంఖారావం సిద్ధం బహిరంగ సభలో పాల్గొనేందుకు గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు తరలి వెళ్లారు. మొత్తం 173 బస్సులు, 100 కార్లలో సుమారు ఎనిమిది వేల మంది ఉత్సాహంగా వెళ్లారు. కాగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి బహిరంగ సభకు వెళుతున్న పార్టీ శ్రేణులకు రాష్ట్ర సమాచార శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ దేవరపల్లి మండలం రామన్నపాలెం వద్ద జాతీయ రహదారిపై భోజన ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ మంత్రి భోజన ఏర్పాట్లను పరిశీలించి, దగ్గరుంచి పార్టీ శ్రేణులకు భోజనాలు పెట్టించి బస్సుల్లో పంపించారు. సుమారు 10 వేల మందికి భోజన ఏర్పాట్లు చేసినట్టు సర్పంచ్ కూచిపూడి బుల్లారావు తెలిపారు. తర్వాత పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి వేణుగోపాలకృష్ణ సిద్ధం సభకు వెళ్లారు. దేవరపల్లి మండలం నుంచి వెళుతున్న బస్సులకు యర్నగూడెం బస్టాండ్ వద్ద వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ బొంతా భరత్‌బాబు, పార్టీ దేవరపల్లి మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు. దేవరపల్లి నుంచి వెళుతున్న బస్సులకు బస్టాండ్ వద్ద ఎంపీపీ కేవీకే దుర్గారావు జెండా ఊపి పంపించారు.



బహిరంగ సభకు వెళ్లే పార్టీ శ్రేణులకు దేవరపల్లి మండలం రామన్నపాలెం వద్ద భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ

నల్లజర్ల: సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి, వైఎస్సార్ సీపీ నాయకులు, జగనన్న సైన్యం భారీ ఎత్తున తరలి వెళ్లారు. జై జగన్ నినాదాలు మండలంలోని వివిధ గ్రామాలు హోరెత్తాయి. నల్లజర్లలో పార్టీ నాయకులు బంక అప్పారావు, కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల రాజారావు, వామిశెట్టి పరమేశ్వరరావు తదితరులు జెండా ఊపి బస్సుల ర్యాలీను ప్రారంభించారు. దాదాపు 50 బస్సులు, 15 కార్లలో పార్టీ శ్రేణులు,కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు వెళ్లారు.

గోపాలపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరు సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని వాదాలకుంటలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ పార్టీ జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. గోపాలపురం నుంచి కూసం రామమోహన్‌రెడ్డి, దొండపూడి నుంచి పోతిరెడ్డి నాగరాజు, గుడ్డిగూడెం నుంచి తోట నాగేశ్వరరావు, భీమోలు నుంచి జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు, అభిమానులు దెండులూరు తరలి వెళ్లారు.

కొవ్వూరు: దెండులూరులో నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభకు కొవ్వూరు నియోజకవర్గం నలుమూలల నుంచి శనివారం వేలాదిలా వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. ఇందుకోసం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి అక్కడి నాయకుల సారథ్యంలో కార్లు, బస్సుల్లో భారీ ఎత్తున ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్ కృష్ణ రెండు రోజుల పాటు కొవ్వూరులో మకాం వేసి సిద్ధం బహిరంగ సభకు నాయకులను, పార్టీ శ్రేణులను సన్నద్ధం చేశారు. తొలుత వివిధ గ్రామాల కాపవరం జంక్షన్ వద్దకు చేరుకున్న వాహనాలకు ఎమ్మెల్యే వెంకట్రావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ముదునూరి నాగరాజు, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, వరిగేటి సుధాకర్, సిర్రా గంగారావు తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలం నుంచి 15 బస్సుల్లో సిద్ధం బహిరంగ సభకు దెండులూరు తరలి వెళ్లారు. పెద్దేవం నుంచి కాపు జేఏసీ నాయకుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. అలాగే తాళ్లపూడి, మలకపల్లి, పోచవరం, అన్నదేవరపేట, ప్రక్కిలంక, వేగేశ్వరపురం గ్రామాల నుంచి తరలి వెళ్లారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవనారాయణ, నాయకులు తోట రామకృష్ణ, మైగాపుల ఆంజనేయులు, పోసిన శ్రీ కృష్ణదేవరాయలు, పిట్టా శ్రీను, మెన్ని సతిష్ కుమార్, సర్పంచ్ సుధారాణి తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

ఎన్నికల కురుక్షేత్రానికి తాము సైతం..



దెండులూరు సభలో తాము కూడా సిద్ధం అంటున్న దేవరపల్లి మండలం కృష్ణంపాలెం రైతులు

దేవరపల్లి: త్వరలో జరగనున్న ఎన్నికల కురుక్షేత్రానికి తాము కూడా సిద్ధం అంటున్నారు మండలంలోని కృష్ణంపాలెం రైతులు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం నిర్వహించిన ఎన్నికల శంఖారావం సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి రైతులు భారీగా తరలి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఎన్నికలు ఎపుడు జరిగినా గోపాలపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇస్తామని పలువురు ఆ గ్రామ రైతులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వర రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి సాయి ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రైతులు సిద్ధం సభకు తరలి వెళ్లారు.

'నిడదవోలు' నుంచి 100 బస్సులు, 20 కార్లలో..



తిమ్మరాజుపాలెంలో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నిడదవోలు మండల శాఖ అధ్యక్షుడు పల్లారావు

నిడదవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దెందులూరులో నిర్వహించిన ఎన్నికల సమరభేరి సిద్ధం మహాసభకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడి ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లాయి. పట్టణంతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఐదు వేల మందికి పైగా తరలి వెళ్లారు. వారి కోసం 100 బస్సులు, 20 కార్లను ఏర్పాటు చేశారు. ఇక్కడకు దెందులూరు దగ్గర కావడంతో చాలామంది కార్యకర్తలు, యువత బైక్‌లపై వెళ్ళి పార్టీపైన, సీఎం జగన్‌పైన తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు పార్టీ నాయకులతో కలసి ఎవరికీ ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. నిడదవోలు పట్టణం నుంచి తరలి వెళ్లిన వారిలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం తదితరులు ఉన్నారు.

నిడదవోలు రూరల్: సిద్ధం బహిరంగ సభకు మండలంలోని 23 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు 30 బస్సులతో పాటు కార్లు, ద్విచక్ర వాహనాలపై తరలి వెళ్లారు. ఈ వాహనాల శ్రేణులకు తిమ్మరాజుపాలెంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, అట్లపాడులో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, తాడిమళ్లలో ఎంపీపీ సిరిమళ్ల భాగ్యలక్ష్మి, సమిశ్రగూడెంలో సొసైటీ అధ్యక్షుడు గజ్జలపు శ్రీరమేష్ జెండా ఊపి ప్రారంభించారు.

ఉండ్రాజవరం: నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడి ఆధ్వర్యంలో మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు 28 బస్సులు, 15 కార్లు, 3 ఆటోలు, ద్విచక్ర వాహనాలపై సుమారు 1,500 మంది ఉత్సాహంగా సిద్ధం బహిరంగ సభకు తరలి వెళ్లారు.

పెరవలి: మండలంలోని 18 గ్రామాల నుంచి 37 బస్సులు, 13 కార్లలో, 60 మంది మోటార్ సైకిళ్లపై జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ వందలాది మంది సిద్ధం బహిరంగ సభకు దెందులూరు తరలి వెళ్లారు. అత్యధికంగా ఖండవల్లి నుంచి ఆరు బస్సులు, నాలుగు కార్లు, 10 మోటార్ సైకిళ్లపై ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో బయలు దేరారు.

'ఆడుదాం ఆంధ్రా' జిల్లా విజేతలు దేవరపల్లి



ప్రథమ స్థానం దేవరపల్లి సచివాలయం మహిళా క్రికెట్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత



జిల్లా స్థాయి పురుషుల ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన యర్నగూడెం సచివాలయం జట్టు

- మహిళా క్రికెట్ విజేత దేవరపల్లి, పురుషుల ఖోఖో విజేత యర్నగూడెం
- కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం

దేవరపల్లి: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో దేవరపల్లి మండల క్రీడాకారులు రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. మహిళల క్రికెట్ ఫైనల్స్‌లో దేవరపల్లి గ్రామ సచివాలయం-1 జట్టు రాజమహేంద్రవరం జట్టుపై విజయం సాధించింది. పురుషుల ఖోఖో విభాగంలో నిడదవోలు జట్టుపై దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామ సచివాలయం జట్టు గెలిచి, ప్రథమస్థానం దక్కించుకుంది. ఒక్కో విజేత జట్టుకు రూ.60 వేల నగదు బహుమతి, ట్రోఫీని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అందజేసి క్రీడాకారులను అభినందించారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన మహిళా క్రికెట్, ఖోఖో జట్లు ఈ నెల 9న అమరావతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని దేవరపల్లి గ్రామ సచివాలయం కార్యదర్శి ఎస్.రవికిషోర్ తెలిపారు. మహిళా క్రికెట్ జట్టును దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, కార్యదర్శి ఎస్.రవికిషోర్ శనివారం అభినందించారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహకాన్ని అందజేస్తామని వారు అన్నారు. కాగా రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి రూ.5 లక్షల నగదు బహుమతిని గెలుచుకుంటామని క్రీడాకారులు ధీమా వ్యక్తం చేశారు.

విద్యా పీఠంలో క్విజ్ పోటీలు



ఆంధ్రా గీర్వాణ విద్యా పీఠంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు: జాతీయ యువజన దినోత్సవం, వివేకానంద జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు శనివారం స్థానిక ఆంధ్ర గీర్వాణ విద్యా పీఠంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. స్వామి వివేకానంద యువజన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలల నుంచి సుమారు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ ఫైనల్ పోటీలకు క్విజ్ మాస్టర్‌గా ఐఐటీ మద్రాసు ప్రాజెక్ట్‌కు చెందిన రాధే శ్యామ్ వ్యవహరించారు. విజేతలకు బహుమతులుగా టెలిస్కోప్, ల్యాబ్‌ట్యాబ్, గిటార్, కీ బోర్డు, రోబోటిక్స్, క్రికెట్ కిట్, ఎన్‌సైక్లోపీడియా అందజేశారు. సమితి అధ్యక్షుడు మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకరశర్మ , వ్యవస్థాపకుడు రాఘవేంద్రరావు పోటీలను ప్రారంభించారు. ఇస్రో మాజీ ఇంజినీర్ విష్ణువర్జుల రామమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల జూనియర్స్ విభాగంలో కొవ్వూరు డీపీవీ స్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. రాజమహేంద్రవరం సత్యసాయి గురుకుల విద్యార్థులు ద్వితీయ, కొవ్వూరు భాష్యం విద్యార్థులు తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

బడ్జెట్ కేటాయింపులపై నిరసన



ఐ.పంగిడిలో కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు


కొవ్వూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ శ్రామికులకు, పేదలకు మేలు చేసేదిగా లేదని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, పౌరహక్కుల సంఘం, ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ వంటి ప్రజా సంఘాల నాయకులు శనివారం మండలంలోని ఐ.పంగిడిలో నిరసన తెలిపారు. కార్మిక వర్గ సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం వల్ల రానున్న రోజుల్లో ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా బడ్జెట్‌ను రూపొందించారని ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు పాతకోకల నాగేశ్వరరావు, సీహెచ్ రమేష్, పీవోడబ్ల్యూ నాయకురాలు ఈమని మల్లిక, ఐ.పంగిడి మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకుడు సూరేపల్లి శ్రీను, క్వారీ వర్కర్స్ యూనియన్ నాయకుడు గంటా సూకరాజు తదితరులు పాల్గొన్నారు.

దైవ సన్నిధి నుంచి తిరిగి వస్తూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కొవ్వూరు: ఆత్రేయపురం మండలం, వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి వెళ్లి మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడేనికి చెందిన ఆవుల కనకేశ్వరరావు (27) అనే యువకుడు దుర్మరణం చెందాడు. విజ్జేశ్వరం బ్యారేజీ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బైక్‌పై వస్తున్న కనకేశ్వరరావును సీతంపేట వైపు నుంచి వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వెళుతున్న మరో మోటార్ సైక్లిస్టు ఢీ కొట్టాడు. దాంతో కిందపడిన కనకేశ్వరరావు తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావమైన అతడు అక్కడికక్కడే మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కోనా శ్రీనివాసరావు తెలిపారు. వెనుక వైపు నుంచి వస్తున్న మృతుడి సోదరుడు ఆవుల పుల్లారావు ప్రమాదాన్ని గుర్తించారన్నారు. పుల్లారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు శ్రీనివాసరావు తెలిపారు. మృతుడికి భార్య, మూడు నెలల పాప ఉన్నారు. కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బదిలీ అయిన ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ శ్రీదేవిని సత్కరించిన సిబ్బంది

గోపాలపురం: స్థానిక ఎంపీడీఓగా పనిచేసి, తూర్పు గోదావరి జిల్లా పరిషత్‌కు బదిలీ అయిన ఆర్.శ్రీదేవిని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆమె స్థానంలో గత ఎన్నికల సమయంలో ఇక్కడ పనిచేసిన కె.రమేష్‌బాబు ఎంపీడీఓగా నియమితులయ్యారు. సోమవారం ఆయన విధులకు హాజరు కానున్నారు. ఎంపీడీఓ శ్రీదేవిని మండల పరిషత్ సూపరింటెండెంట్ గెల్లా రాజ్‌మనోహర్, అనిల్, పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బంది సత్కరించారు.

ఎస్సై సుభానీకి ఘన సన్మానం



సమిశ్రగూడెం ఎస్సై సుభానీ దంపతులను సన్మానిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, పోలీసులు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌లో మూడున్నరేళ్ల పాటు ఎస్సై సుభానీ పనిచేయడం అభినందనీయమని నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎస్సై సుభానీ ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి స్టేషన్ పరిధిలోని పోలీసులు సుభానీ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు పరమహంస, ఆంజనేయులు, స్టేషన్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

గోపాలపురం: మండలంలోని గంగోలు పంచాయతీ పరిధిలోని హుకుంపేట హోతా కామేశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌కు హుకుంపేట జమీందారు హోతా రాజాబాబు రూ. 70 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. పాఠశాల హెచ్ఎం అచ్యుత మోహన్‌రావుకు శనివారం వాటిని అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బిక్కవోలు నాగేశ్వరరావు, గ్రామస్తులు రాజాబాబును అభినందించారు.



జెడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరిస్తున్న దాత హోతా రాజాబాబు

81 మందికి ఆయుర్వేద వైద్య పరీక్షలు

నిడదవోలు: రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ సభ్యులు నిర్వహిస్తున్న వివిధ సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కొనియాడారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 81 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, డాక్టర్ కె.శ్రీవిద్య, ఉప్పులూరి వీరభద్రరావు, గుంటుపల్లి శివ కుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంపై గ్రామ సభ

తాళ్లపూడి: ప్రక్కిలంకలో యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు చేపట్టిన సూర్య దేవాలయం నిర్మాణంపై అభ్యంతరం తెలుపుతూ గ్రామస్తులు కొద్ది రోజుల క్రితం అధికారులకు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జి .ప్రసాద్, ఇతర అధికారులు కలిసి శనివారం గ్రామ సభ నిర్వహించారు. దాతలు ఇచ్చిన స్థలంలో వారి సహకారంతో తాను ఆలయాన్ని నిర్మిస్తున్నానని యోగా గురువు తెలిపారు. ఈ స్థలానికి తన వద్ద రిజిస్ట్రేషన్ సహా అన్ని లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయని ఆయనన్నారు. దీనిపై వీఆర్వో పి. విజయకుమారి స్పందిస్తూ నిర్మాణ స్థలం గ్రామ ఎక్స్‌డెండ్ గ్రామకంఠంలో ఉందన్నారు. ఈ మేరకు సదరు యజమాని డాక్యుమెంట్ సమర్పించారని, ఇది సివిల్ వివాదం కనుక కోర్టులో తేల్చుకోవాలన్నారు. స్పందనలో ఫిర్యాదు చేసిన గ్రామానికి చెందిన ముళ్ల మల్లిబాబు ఇతర గ్రామస్తులు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, ఆలయ నిర్మాణం నిలుపుదల చేయాలంటూ గ్రామసభలో తీర్మానం చేయాలని కోరారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి తగిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ చెప్పారు.